

మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ వి.అవంతిరావు



నీలా నుంచి యువ గర్జన సభకు తరలి వెళ్తున్న నాయకులు

## కాంగ్రెస్, బీజేపీల డిపాజిట్లు గల్లంతు ఖాయం

- 50 వేల మెజారిటీతో షకీల్ విజయం పక్కా
- భారత జాగృతి జిల్లా కన్వీనర్ వి.అవంతిరావు

నవీపేట, నవంబర్ 2: వచ్చే ఎన్నికల్లో బోధన్ నియోజక వర్గం నుంచి పోటీ చేసే కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థుల డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ ఆమేర్ 50 వేల మెజారిటీతో విజయం సాధించడం పక్కా అని భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు వి.అవంతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు పేర్కొన్నారు. గురువారం బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా యువ గర్జన సభకు నవీపేట నుంచి యువకులు తరలి వెళ్లగా మార్గ మధ్యలో వారు విలేకరులతో మాట్లాడారు. నవీపేట మండలంలోని 32 జీపీల నుంచి 150 వాహనాల్లో 6 వేలకు పైగా యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో నియోజక వర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. యువగర్జనకు వచ్చిన యువతరాన్ని చూసిన ప్రతి పక్షాల గుండెల్లో రైల్లు పరిగెత్తుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే షకీల్ చెప్పిన విధంగా నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీకి పోటీ కానే కాదని అన్నారు. బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డికి సైతం డిపాజిట్ గల్లంతు అవుతుందని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు తెడ్డు పోశెట్టి, దొంత ప్రవీణ్‌కుమార్, న్యాలకంటి అబ్బన్న, బీఆర్ఎస్ యువజన మండల అధ్యక్షుడు మంత్రి సాయికుమార్‌గౌడ్, అల్లం రమేశ్, కిషన్‌రావు, బత్తూర్ సాయిలు, రాములు, ఆయా గ్రామాల యువ ప్రజాప్రతినిధులు తరలి వెళ్లారు.

### యువ గర్జనకు తరలిన నాయకులు

రెంజల్, నవంబర్ 2: బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ క్రీడా మైదానంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన యువ గర్జనకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కవిత హాజరవుతున్నందున సభను విజయవంతం చేసేందుకు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా యువతతోపాటు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లినట్లు పార్టీ మండలాధ్యక్షుడు భూమారెడ్డి తెలిపారు.

## ఇంటింటా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

బోధన్ రూరల్, నవంబర్ 2: సాలూర మండలంలోని జాడి జమాల్‌పూర్ గ్రామంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు బోధన్ ఎమ్మెల్యే షకీల్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌ను భారీ మెజార్టీతో గెలపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు



జాడిజమాల్ పూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

## ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
- ఎలక్షన్ సెల్, కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు
- 15వ తేదీ వరకు 144 సెక్షన్
- నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాజాగౌడ్



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాజాగౌడ్

బోధన్, నవంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల దాఖలు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లుచేశామని బోధన్ ఆర్డీవో, బోధన్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారని అన్నాన్నారు. బోధన్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలోనే బోధన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటయిందని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ఈనెల 15న ఉంటుందని, ఆరోజు వరకు ఈ కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు తెలిపారు. నామినేషన్ల దాఖలకు అభ్యర్థితో కలుపుకుని మొత్తం ఐదుగురు మాత్రమే వచ్చేందుకు అనుమతి ఉందన్నారు. నామినేన్ ఫారాలను ముందుగా అభ్యర్థులు గాని, వారి ఏజెంట్లుగాని ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఈనెల 13న నామినేషన్లను పరిశీలించి అదే రోజు సాయంత్రం అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తామన్నారు. 14,15 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, 15వ తేదీ సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ఖరారవుతుందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 2,15,000 ఓటర్లు ఉన్నారని, మరో ఐదు వేల మంది ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఓటర్ల తుది జాబితాను ఈనెల 11న విడుదలచేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 246 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

**ఎన్నికల సెల్, హెల్ప్ డెస్క్ ఏర్పాటు**

నామినేషన్ల ప్రక్రియ, మొత్తం ఎన్నికల ప్రక్రియ కోసం ఎన్నికల సెల్, కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశామని ఆర్డీవో తెలిపారు. నామినేషన్ ఫారాలను పూర్తి చేయడంలో హెల్ప్‌డెస్క్‌ల సహకారం తీసుకోవచ్చని, సువిధ యాప్ ద్వారా అనుమతుల కోసం ఎన్నికల సెల్ ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు నిబంధనకు అనుగుణంగా జరిగేలా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని ఆర్డీవో కోరారు. సమావేశంలో బోధన్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ శశిభూషణ్ పాల్గొన్నారు.

## 6న బోధన్‌లో 'గౌడ ఆత్మీయ సమ్మేళనం'

### హాజరు కానున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

శక్కర్‌నగర్, నవంబర్2: బోధన్ పట్టణంలోని ఏకచక్రనగర్‌లోని కౌండిన్య గౌడ సంఘం కల్యాణ మండపంలో ఈనెల 6న గౌడ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నియోజకవర్గంలోని గౌడ సంఘం నాయకులు తెలిపారు. గురువారం ఈ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌడ సంఘం ప్రతినిధులు పి.గంగాధర్ గౌడ్, సుదర్శన్ గౌడ్, రాజా గౌడ్, సాయిబాబా గౌడ్, రవీందర్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సహకారంతో ఏర్పాటు చేయనున్న ఈ సమ్మేళనానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరవుతారని, నియోజకవర్గంలోని గౌడ కులస్తులు తమ కుటుంబీకులతో హాజరు కావాలని కోరారు. నియోజకవర్గంలోని గౌడ కులస్తులు ఈనెల6న ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి భారీ సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

## ప్రభుత్వ దవాఖాన స్థలం కబ్జాదారులపై కేసు

నవీపేట, నవంబర్2: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపట్టిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ధర్యాపూర్ గ్రామానికి చెందిన నవీన్, ప్రవీణ్, బాబు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టి షెడ్డు నిర్మించారని ఆయన తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## రైతులకు ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న చైర్మన్ ఇమ్రాన్‌బేగ్

రెంజల్, నవంబర్ 2: నీలా సహకార సంఘం పరిధిలోని కందకుర్తి రైతులకు గురువారం యూరియా బస్తాలను పంపిణీ చేసినట్లు విండో చైర్మన్ ఇమ్రాన్‌బేగ్ తెలిపారు. రవాణా, సమయం వృథా కాకుండా పొగాకు, శనగ పంటల సాగుకోసం ఉపయోగించే యూరియా బస్తాలను నేరుగా రైతు చేతికే అందిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఇప్పటి వరకు 200 వందల మెట్రిక్ టన్నులు యూరియాను పంపిణీ చేసినట్లు నీలా విండో చైర్మన్ పేర్కొన్నారు.

## 108లో మహిళ ప్రసవం



108లో పురుడు పోసి బిడ్డను కుటుంబీకులకు అప్పగిస్తున్న సిబ్బంది

శక్కర్‌నగర్, నవంబర్2: సాలూరా మండలంలోని సాలంపాడ్ గ్రామానికి చెందిన సవిత అనే గర్భిణికి గురువారం ఉదయం 108 అంబులెన్సు సిబ్బంది ప్రసవం జరిపించి, పండంటి ఆడబిడ్డను కుటుంబీకులకు అప్పగించారు. ఉదయం అందిన సమాచారం మేరకు సవితను ప్రసవం కోసం బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యంలోని సాలూరా క్యాంప్ వద్ద పురుటి నొప్పులు అధికం అయ్యాయి. వాహనాన్ని నిలిపి వారివెంట వచ్చిన ఆశ కార్యకర్త బేబి సోని సహకారంతో, టెక్నీషియన్ లక్ష్మణ్ ఆమెకు సుఖ ప్రసవం జరిపించారు. మొదటి కాన్పులో జన్మించిన ఆడబిడ్డను, తల్లిని బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. మహిళకు ప్రసవం జరిపించిన 108 టెక్నీషియన్ లక్ష్మణ్, పైలట్ కేశవ్ కుమార్, ఆశకార్యకర్తను కుటుంబీకులు, వైద్యులు అభినందించారు.

## ఎమ్మెల్యే షకీల్‌ను విమర్శించే స్థాయి శరత్‌రెడ్డికి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బోధన్ రూరల్, నవంబర్2: బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే షకీల్‌ను విమర్శించే స్థాయి కౌన్సిలర్ శరత్‌రెడ్డికి లేదని సాలూర మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం సాలూర మండల కేంద్రాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. శరత్‌రెడ్డి గత చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. గతంలో రైతుల వద్ద వడ్లు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా కోర్టు నుంచి ఐపీ పెట్టి రైతులను ముంచి పారిపోయిన సంగతి ప్రజలకు తెలుసని అన్నారు. ఎమ్మెల్యేపై చేసిన అసత్య ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ కార్యకర్తలు అడ్డుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సన్న, విండో చైర్మన్ అల్లె జనార్దన్, నాయకులు సాయిలు, సురేశ్, శివకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

రెంజల్, నవంబర్ 2: మండలంలోని నీలా–నవీపేట ప్రధాన రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఎస్సై పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మహారాష్ట్ర–తెలంగాణ అంతరాష్ట్ర సరిహద్దు మార్గంలోని నీలాలో గురువారం తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో మద్యం, డబ్బు తరలిస్తే స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వాహనాల్లో ఆధారాలు లేకుండా రూ. 50వేలకు పైబడి నగదు తరలిస్తే స్వాధీనం చేసుకొని సంబంధిత శాఖకు అప్పగిస్తామని అన్నారు. తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దులో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని, ప్రజలు సహకరించాలని ఎస్సై పేర్కొన్నారు.